యువతకు ఎన్‌సిసి ఎంతో ఉపయోగం

ప్రజాశక్తి-విజయనగరం

దేశ భవితకు, యువతకు ఎన్‌సిసి ఎంతో ఉపయోగపడుతుందని కమాండింగ్ ఆఫీసర్ కార్నల్ నోటీయల్ అన్నారు. గర్ల్స్ బెటాలియన్ ఎన్‌సిసి విజయనగరం కమాండింగ్ ఆఫీసర్ ఎకె నోటీయల్ బదిలీ సందర్భంగా విజయనగరం ఎన్‌సిసి బెటాలియన్‌లో మంగళవారం వీడ్కోలు సభ నిర్వహించారు. బెటాలియన్ స్టాఫ్ , ఎన్‌సిసి అధికారులు, సత్యా కళాశాల ఆధ్వర్యాన నోటీయల్‌ను సన్మానించారు. అనంతరం కమాండింగ్ ఆఫీసర్ నోటియల్ మాట్లాడుతూ రాబోయే కాలంలో ఎన్సిసి లో వస్తున్న మార్పుల గురించి వివరించారు. సత్య విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణ రావు ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ గత మూడేళ్లగా నోటియల్ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అడ్మిన్ ఆఫీసర్ మేజర్ శివాని శ్రీ వాస్తవ, సుబేదార్ మేజర్ రామ్ దత్, సూపరింటెండెంట్ సురేష్, ఎన్‌సిసి అధికారి కెప్టెన్ ఎం.సత్యవేణి, లెఫ్టినెంట్ ఎం.వరలక్ష్మి, అమృత, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతలో ఆనందం

- 73.4 మి.మీ. అధిక వర్షపాతం
- పూర్తయిన నారుపోత
- నిండుతున్న చెరువులు
- వరిసాగుపై పెరుగుతున్న ఆశలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో గడిచిన వారం రోజులుగా కుస్తున్న వర్షాలతో ఖరీఫ్ వ్యవసాయ పనులు ప్రారంభమయ్యాయి. చెరువులు నిండుతున్నాయి. వాగు, వంకలు పారుతున్నాయి. నదుల్లోనూ నీరు ప్రవహిస్తోంది. ప్రాజెక్టుల్లో నీరు చేరింది. మొత్తంగా ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచీ పరిశీలిస్తే 73.4 మిల్లీ మీటర్ల అధిక వర్షపాతం నమోదైంది. మరోవైపు నాలుగైదు రోజుల క్రితమే నారుపోత పూర్తయ్యింది. దీంతో, ఈ ఏడాది సకాలంలో ఉబాలు పూర్తవుతాయని రైతులు, వ్యవసాయ కార్మికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా అన్నదాత మదిలో ఆనందం వెల్లు విరుస్తోంది.

జిల్లాలో సాధారణంగా జూన్ రెండో వారం నుంచే ఖరీఫ్ సీజన్ ప్రారంభమౌతుంది. జూన్‌లో సాధారణ వర్షపాతం 123.5 మి.మీ.కాగా కేవలం 59.4 మి.మీ. మాత్రమే కురిసింది. 51.9 మి.మీ వర్షపులోటు నమోదు కావడంతో నారు మడులు తయారు చేయడానికి కూడా వీలు లేకుండా పోయింది. జులై 2వ తేదీ నుంచీ ప్రారంభమైన వర్షాలు క్రమంగా పెరిగాయి. 25వ తేదీ నాటికి సాధారణ వర్షపాతం 136.7 మి.మీ కాగా, 237 మి.మీ కురిసింది. దీంతో, 73.4 మి.మీ వర్షం అధికంగా నమోదైంది. మరోవైపు నాలుగైదు రోజుల క్రితమే వరి నారు పోత పూర్తయ్యింది. ప్రస్తుత వర్షాలతో చెరువులు, జలాశయాల్లో నీటిమట్టాలు పెరిగాయి. వాగు, వంకల్లో నీరుపారుతోంది. నదుల్లోనూ నీరు ప్రవహిస్తోంది. దీంతో, ఈ ఏడాది సకాలంలోనే ఉబాలు అవుతాయన్న ఆశతో రైతులు, వ్యవసాయ కార్మికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది జిల్లాలో ఖరీఫ్ పంటలన్నీ కలిపి 3,13,465 ఎకరాల్లో సాగవుతాయని అధికారులు అంచనా వేశారు. ఇందులో అత్యధికంగా 2,25,637 ఎకరాల్లో వరి సాగుకావాల్సి ఉంది. కొన్ని చోట్ల మరో వారం పదిరోజుల్లో ఉబాలు ప్రారంభమౌతాయని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. అందుకు తగ్గట్టే వర్షపాతం నమోదైంది. ఈనెలలో ఇప్పటి వరకు 18రోజులు వర్షాలు పడ్డాయి. సీజన్ మొత్తంగా పరిశీలిస్తే 24రోజుల పాటు వర్షం కురిసింది. అత్యధికంగా జామి మండలంలో 21రోజు, మెరకముడిదాం, దత్తిరాజేరు మండలాల్లో 20రోజులు, తెర్లాం, ఎల్ కోట మండలాల్లో 19రోజులు, బొబ్బిలి, మెంటాడ, ఎస్.కోట, ఎల్.కోటల్లో 18రోజుల చొప్పున వర్షం కుసింది. అత్యల్పంగా పూసపాటి రేగ మండలంలో 8రోజులు, భోగాపురంలో 9రోజులు, డెంకాడలో 12రోజులు మాత్రం వర్షం పడింది. పూసపాటిరేగ మండలంలో సాధారణ వర్షపాతం నమోదు కాగా, భోగాపురం, డెంకాడ మండలాల్లో మాత్రం ఇంకా లోటు వర్షపాతం కొనసాగుతోంది. అటు వంగరలోనూ 28 మి.మీ వర్షపులోటు ఉంది. మిగిలిన కొన్ని మండలాల్లో అధికంగానూ, సాధారణం గానూ వర్షం కురిసినట్లు అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

జిల్లా అంతటా భారీ వర్షాలు

గత నాలుగు రోజులుగాజిల్లాలో భారీవర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం జిల్లా వ్యాప్తంగా 29.4మి.మీ. వర్షం కురిసింది. అత్యధికంగా కొత్తవలసలో 52.1మి.మీ. జామిలో 48మి.మీ, పూసపాటిరేగలో 47.3 మి.మీ. వర్షం కురిసింది. అత్యల్పంగా మెరకముడిదాం మండలంలో 8.9మి.మీ, విజయనగరంలో కురిసిన వర్షాలతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వర్షాలతో చాలాచోట్ల వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి.

రిజర్వాయర్లలో పెరిగిన నీటి మట్టాలు

జిల్లాలోని ఆంధ్ర, తాటిపూడి, మడ్డువలస ప్రాజెక్టుల్లో నీటి మట్టాలు పెరిగాయి. మడ్డువలసలో 65 మీటర్లు లెవెల్ నీటి మట్టానికి గాను ప్రస్తుతం 64.40 మీటర్లు ఉంది. ఆంధ్ర ప్రాజెక్టులో నీటిమట్టం 146 మీటర్లు కాగా, ప్రస్తుతం 139మీటర్లకు చేరింది. తాటిపూడి రిజర్వాయర్‌లో297 అడుగుల నీటిమట్టం సామర్థ్యానికి గాను 290 అడుగులకు చేరింది.

ఇథనాల్ పరిశ్రమకు భూమి కేటాయింపు

- మౌలిక సౌకర్యాలకు ప్రతిపాదనలు
- ఫెర్రో పరిశ్రమలకు విద్యుత్ భారం లేదు
- ఐటి శాఖామంత్రి గుడివాడ అమర్నాథ్

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి గ్రోత్ సెంటర్లో ఇథనాల్ పరిశ్రమకు 30ఎకరాలు భూమి కేటాయించినట్లు ఐటి శాఖామంత్రి గుడివాడ అమర్నాథ్ తెలిపారు. గ్రోత్ సెంటర్ అభివృద్ధిపై ఎపిఐఐసి అధికారులతో మంగళవారం అడ్మినిస్ట్రేషన్ భవనంలో మంత్రి సమీక్ష నిర్వహించారు. గ్రోత్ పరిశ్రమల అభివృద్ధి, సౌకర్యాలపై ఎపిఐఐసి జోనల్ మేనేజర్ యతిరాజును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రోత్ సెంటర్లో ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటుకు 30 ఎకరాలు స్థలం కేటాయించినట్లు చెప్పారు. పారిశ్రామిక వాడలో రహదారులు పాడైపోవడంతో సిసి రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు చేస్తున్నట్లు చెప్పారు. నెల్లూరు పారిశ్రామిక వాడలో రూ.22కోట్లతో సిసి రోడ్లు నిర్మించామని చెప్పారు. గ్రోత్ సెంటర్లో ఆస్తిపన్ను రూ.2.80కోట్లు బకాయి ఉందని, వసూలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. మోయిలీ పరిశ్రమకు విశాఖ పారిశ్రామిక వాడలో భూమి కేటాయించాలని దరఖాస్తు చేసుకున్నారని ప్రభుత్వం పరిశీలిస్తోందని చెప్పారు. స్టీల్ ఎక్చేంజ్ ఇండియా లిమిటెడ్ పరిశ్రమ ఏర్పాటుకు కాల పరిమితి పూర్తి కావడంతో కాలపరిమితి పొడిగించాలని కోర్టులో యాజమాన్యం కేసు వేసినట్లు చెప్పారు.

ఫెర్రో పరిశ్రమలకు విద్యుత్ భారం లేదు

ఫెర్రో పరిశ్రమలకు విద్యుత్ భారం లేదని ఐటి శాఖామంత్రి గుడివాడ అమర్నాథ్ అన్నారు. విద్యుత్ యూనిట్ ఛార్జీలు ప్రభుత్వం పెంచలేదని, గతం వాడిన విద్యుత్‌కు ట్రూ అప్, ఎఫ్‌పిపిసిఎ ఛార్జీలను వసూలు చేస్తున్నామని చెప్పారు. లాభాలు ఆర్జించిన ఫెర్రో యాజమాన్యాలు నష్టాలు పేరుతో పరిశ్రమలను మూసివేస్తామని చెప్పడం సరికాదన్నారు. ఫెర్రో పరిశ్రమల సమస్య ప్రభుత్వం దృష్టిలో ఉందని, పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సమావేశంలో మాట్లాడుతున్న పరిశ్రమలశాఖా మంత్రి అమర్నాథ్

సాలూరు ఆటో నగర్ అభివృద్ధికి నిధులు కేటాయించాలి

పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు ఆటో నగర్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఐటి శాఖామంత్రి గుడివాడ అమర్నాథ్ ను మున్సిపల్ కమిషనర్ హనుమంతు శంకరరావు కోరారు. ఆటో నగర్ ఏర్పాటుకు ప్రభుత్వం 1.50ఎకరాల భూమి కేటాయించిందని, ప్రహరీ, రోడ్లు, కాలువలు, మంచినీటి సౌకర్యం కల్పనకు రూ.4.30కోట్లతో ప్రతిపాదనలను మంత్రి అమర్నాథ్ కు అందజేశారు. ఆటో నగర్ లో ట్రాన్స్ ఫోర్ట్ హబ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఎపిఐఐసి జోనల్ మేనేజర్ యతిరాజును ఆదేశించారు. ఆయనతో జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు, వైసిపి మండల అధ్యక్షులు శంబంగి వేణుగోపాలనాయుడు ఉన్నారు.

స్విచ్ ఆన్‌చేసి నీరు విడుదల చేస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, ఎమ్మెల్యే జోగులు

రైతు సంక్షేమానికి పెద్దపీట

- ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్
- మడ్డువలస ప్రాజెక్ట్ నుంచి నీరు విడుదల

ప్రజాశక్తి-వంగర

రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. మడ్డవలస ప్రాజెక్టు నుంచి మంగళవారం నీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాజెక్ట్ ఆయకట్టు శివారు భూములకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆయకట్టు రైతులు సాగునీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రాజెక్టు ఇఇ హనుమంతు మన్మధరావు మాట్లాడుతూ ప్రాజెక్టు దిగువ ఆయకట్టు అయిన వంగర, రేగిడి, సంతకవిటి, శ్రీకాకుళం జిల్లాలోని జి.సిగడాం, పొందూరు మండలాలకు సంబంధించి స్టేజ్ వన్ లో 24877 ఎకరాలకు, స్టేజ్ 2 లో లావేరు మండలానికి సంబంధించి 5200 ఎకరాలకు, మొత్తం 30077 ఎకరాలకు ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి సాగునీరు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. మొదటి రోజు 100 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు వివరించారు. ప్రాజెక్టులో 65 మీటర్లు లెవెల్ నీటి మట్టానికి గాను ప్రస్తుతం 64.40 మీటర్లు లెవెల్ నీటిమట్టం ఉందన్నారు. సువర్ణముఖి వేగవతి నదుల నుంచి 613 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ఉత్తరావల్లి సురేష్ ముఖర్జీ, వైస్ ఎంపిపి కిమిడి ఉమా మహేశ్వరరావు, వైసిపి నాయకులు కరణం సుదర్శనరావు, డిఇ పి.అర్జున్, ఎంపిడిఒ శ్రీనివాసరావు, బెవర శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుకు ప్రోత్సాహం

చిరుధాన్యాల పరిశ్రమ ప్రారంభోత్సవంలో కలెక్టర్
వర్చువల్‌గా ప్రారంభించిన సిఎం జగన్

ప్రజాశక్తి-లక్కవరపుకోట

మండలంలోని కళ్లేపల్లిరేగ గ్రామంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి మంగళవారం వర్చువల్ విధానంలో, తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ప్రారంభించారు. ఆపరేషన్ గ్రీన్ ప్రాజెక్ట్ కార్యక్రమం కింద రాష్ట్రవ్యాప్తంగా 11 ఆహార శుద్ధి పరిశ్రమల్లో ఆరు పరిశ్రమలను ప్రారంభించి, మరో ఐదు పరిశ్రమలకు శంకుస్థాపన చేశారు. జిల్లాలో సుమారు రూ.4కోట్ల వ్యయంతో ఎల్.కోట మండలంలో ఏర్పాటు చేసిన చిరుధాన్యాల పరిశ్రమను ప్రారంభించిన అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ, చిరుధాన్యాల సాగును ప్రోత్సహించడం, వాటికి అదనపు విలువను జోడించడంతోపాటు, రైతుకు తగిన గిట్టుబాటు ధర కల్పించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఆరోగ్య మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ సామర్థ్యం, లక్ష్యాలను, రైతు ఉత్పత్తిదారుల సంఘం సిఇఒ సత్యవతి తాడేపల్లి నుంచే సిఎంకు వివరించారు.

చిరుధాన్యాల సాగుకు ప్రోత్సాహం

ప్రాసెసింగ్ యూనిట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ, సుమారు రూ.4కోట్లతో ఈ పరిశ్రమను ఏర్పాటు చేశామన్నారు. ఇక్కడ చిరుధాన్యాలను శుద్ధి చేయడంతోపాటు, పిండి, బిస్కెట్లు, మిక్చర్ తదితర ఉత్పత్తులను తయారు చేస్తారని చెప్పారు. సుమారు 1500 మంది మహిళా రైతులు ఏర్పాటు చేసిన ఈ పరిశ్రమద్వారా, 30 మందికి ఉపాధి లభిస్తుందని చెప్పారు. జిల్లాలో చిరుధాన్యాల రైతులకు అన్నివిధాలా సహకారాన్ని అందిస్తున్నామని చెప్పారు. ముఖ్యంగా జిల్లాలో రాగి పంట సాగుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఆరోగ్యం, పోషకాల కోసం ఇటీవల కాలంలో చిరుధాన్యాల వినియోగం పెరిగిందని, ఇది రైతుకు మేలు చేసే విషయమని పేర్కొన్నారు. ఆహారశుద్ధి పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే వారికి అన్ని విధాలా సహకారం అందిస్తున్నామని కలెక్టర్ తెలిపారు.

చిరుధాన్యాల పరిశ్రమను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

ఆహారశుద్ధి పరిశ్రమను ఏర్పాటు చేయాలి

ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు మాట్లాడుతూ భీమసింగి చెరకు కర్మాగారం మూతబడిందని, దాని స్థానంలో ఆహారశుద్ధి పరిశ్రమను ఏర్పాటు చేసి, ఈ ప్రాంత రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. తమ నియోజకవర్గంలో సుమారు 80శాతం మంది వ్యవసాయం పైనే ఆధారపడి ఉన్నారంటూ, వారి పరిస్థితిని సిఎంకి వివరించారు. వీరి పరిస్థితి ఒకప్పుడు దయనీయంగా ఉండేదని, భూములను అమ్ముకొని, ఉపాధి కోసం ఇతర జిల్లాలకు వలసలు వెళ్లాల్సి వచ్చేదని తెలిపారు. జిల్లాలో చిరుధాన్యాల సాగును సుమారు 800 హెక్టార్లకు, కేవలం తన నియోజకవర్గంలోనే 300 హెక్టార్లకు పెంచేందుకు కషి చేస్తున్నామని ఎంఎల్‌ఎ తెలిపారు.

అనంతరం ఎంఎల్‌ఎ కడుబండి, కలెక్టర్ నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఇతర అతిధులు జ్యోతి ప్రజ్వలనం చేసి, పరిశ్రమను లాంఛనంగా ప్రారంభించారు. శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపిపి గేదెల శ్రీనివాసరావు, జెడ్‌పిటిసి తూర్పాటి వరలక్ష్మి, రాష్ట్ర జానపద కళల డైరెక్టర్ వాకాడ రాంబాబు, పార్టీ నాయకులు శోభా హైమావతి, గుమ్మడి సత్యనారాయణ, జిల్లా వ్యవసాయాధికారి విటి రామారావు, ఉద్యాన శాఖాధికారి జమదగ్ని, ఎడి శైలజ, డిఎల్‌డిఒ నిర్మలాదేవి, ఎపిడి శారద, ఇతర అధికారులు, సిబ్బంది, ఎఫ్‌పిఒ సభ్యులు పాల్గొన్నారు.

బొబ్బిలిలో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు, యుటిఎఫ్ నాయకులు

మణిపూర్ దారుణాలపై యుటిఎఫ్ నిరసన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్, బొబ్బిలి

మణిపూర్‌లో జరుగుతున్న అత్యాచారాలను, దారుణాలను ఖండిస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యాన ఉపాధ్యాయులు విజయనగరం, బొబ్బిలిలో మంగళవారం నిరసన తెలిపారు. మణిపూర్‌లో శాంతి వాతావరణం నెలకొల్పాలని డిమాండ్ చేశారు. విజయనగరం కలెక్టరేట్ వద్ద జరిగిన నిరసనలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రమేష్ చంద్రపట్నాయిక్, జెఎవిఆర్‌కె ఈశ్వరరావు మాట్లాడారు. వెంటనే ప్రభుత్వం కలుగ చేసుకొని మణిపూర్ దారుణాలకు పాల్పడిన దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ కె.శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శులు కె ప్రసాద్‌రావు, సిహెచ్ తిరుపతి నాయుడు, జి. రాజారావు, ఎన్.సత్యనారాయణ, ఎ.శంకర్రావు, జిల్లా కార్యవర్గ సభ్యులు జి.నిర్మల, జిల్లా సిపిఎస్ కన్వీనర్ రాంప్రసాద్, మండల నాయకులు జి.రమణ, మహేష్ తదితరులు పాల్గొన్నారు..

కొవ్వొత్తులతో నిరసన

మణిపూర్ అల్లర్లకు నిరసనగా యుటిఎఫ్ ఆధ్వర్యంలో బొబ్బిలిలోని గాంధీ బొమ్మ వద్ద నిరసన తెలిపారు. మణిపూర్ దాడులను ఆపి మహిళలకు భద్రత కల్పించాలని, మహిళలపై అత్యాచారాలు చేస్తున్నవారిని కఠినంగా శిక్షించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె. విజయ గౌరి డిమాండ్ చేశారు. మణిపూర్ అల్లర్లపై ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్‌షా స్పందించక పోవడం అన్యాయ మన్నారు. అల్లర్లకు స్వస్తి చెప్పి ప్రశాంత వాతావరణం నెలకొల్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యుటిఎస్ జిల్లా కార్యదర్శి కేశవరావు, జిల్లా సహా అధ్యక్షులు వి.ప్రసన్నకుమార్, జిల్లా నాయకులు మధు, రామకష్ణ, ఎపిటిజి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కష్ణదాసు, ఎస్ఎఫ్ఐ నాయకులు కె.మణికుమార్, డేవిడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

బాలల హక్కుల పరిరక్షణ చైర్మన్ కేసలి

ప్రజాశక్తి-విజయనగరం

పిల్లలంతా బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని బాలల హక్కుల పరిరక్షణ చైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. మంగళవారం స్థానిక కెజిబివి పాఠశాలలో బాలల చట్టాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బాలికలు పరీక్షల్లో ఒత్తిడి లేకుండా ప్రణాళికా బద్ధంగా చదువుకొని విజయం సాధించాలని సూచించారు. సోషల్ మీడియాకు, సెల్ ఫోన్లు కు దూరంగా ఉండాలని, అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని, ఇతరులు చెప్పిన మాయ మాటలు విని మోసపోకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. తల్లి దండ్రులు ఆశయాలను ఆచరణలో పెట్టి లక్ష్యం ఏర్పరచుకొని వాటిని సాధించే దిశగా అడుగులు ముందుకు వేయాలని కోరారు. వంట గదిని, బోజనాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. బాలల భద్రత, రక్షణ, సంరక్షణ, అభివద్ధి కోసం బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ నిరంతరం పని చేస్తూ, పర్యవేక్షణ బాధ్యతలను నిర్వహిస్తారని తెలిపారు. వసతి గృహం సిబ్బంది అంకిత భావంతో పనిచేయాలని, తరుచుగా వైద్య పరీక్షలు నిర్వహించాలని, ఇతరులు అనుమతి లేకుండా కేంద్రంలోకి రాకుండా చూడాలని సూచించారు. సచివాలయం మహిళా పోలీస్ సిబ్బంది తరుచుగా కేంద్రాన్ని పర్యవేక్షణ చేయాలని, పోలీస్ సిబ్బంది పెట్రోలింగ్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. సిసి కెమెరాలు తప్పని సరిగా ఎల్ల వేళలా పనిచేయాలని, ఫిర్యాదులు పెట్టేను అందుబాటులో ఉంచాలని తెలిపారు. వచ్చిన ఫిర్యాదులను సంబంధిత అధికారులు సమక్షంలో తెరిచి రికార్డు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి అల్లు సత్యనారాయణ బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి అవగాహరన కల్పించారు. కార్యక్రమంలో కెజిబివి ప్రిన్సిపల్ ఎ. సుజాత కుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

శిశువుల్లో లోపాలను చిన్నప్పడే గుర్తించాలి

వర్క్‌షాప్‌లో యునిసెఫ్ బృందం సభ్యులు

ప్రజాశక్తి-విజయనగరం

బిడ్డలు జన్మించిన నుండి మూడేళ్ల లోపలే మెదడు ఎదుగుదల జరుగుతుందని, ఈ వయసు లోనే బిడ్డల్లోని లోపాలను కుటుంబ సభ్యులే ముందు గుర్తించాలని యునెసెఫ్ బృందం సభ్యులు పేర్కొన్నారు. తొందరగా గుర్తించడం వలన వారిలోని లోపాలను తొందరగా సరిదిద్దుకునే అవకాశం కలుగు తుందని తెలిపారు. మూడేళ్ల వయస్సు లోపల వయసుకు తగ్గట్టుగా శిశువులలో అభివృద్ధి జరుగుతుందని, ఏ వయసు లో ఏమేమి మార్పులు జరుగుతాయో తల్లి దండ్రులకు లేదా కుటుంబ సభ్యులకు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని అన్నారు. పిల్లల పెంపకం కోసం కుటుంబం, సంఘానికి సాధికారత చేకూర్చడం అనే అంశం పై యునిసెఫ్ లో ఇండియన్ ఇనిస్టిట్యూట్ అఫ్ పబ్లిక్ హెల్త్ విభాగం నుండి విచ్చేసిన వైద్యుల బృందం కలెక్టరేట్ ఆడిటోరియంలో వర్క్ షాప్ నిర్వహించింది. ఐసిడిఎస్ నుండి సిడిపిఒలు, సూపర్ వైజర్లు , వైద్య ఆరోగ్య, పంచాయతీరాజ్ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

బృందం నాయకులు డాక్టర్ రాజన్ శుక్ల మాట్లాడుతూ శిశువు తల్లి గర్భం లో ఉన్నప్పటి నుంచే నేర్చుకుంటుందని, అందువలన గర్భిణీగా ఉన్నపుడు ఆహ్లాదకరమైన వాతావరణం ఉండాలని, మంచి మాటలు మాట్లాడడం, సంతోషంగా ఉండడం, సంగీతాన్ని వినడం, మంచి ఆహారాన్ని తీసుకోవడం వంటి పనులు చేయాలని తెలిపారు. బిడ్డ జన్మించిననుంచి వచ్చే మార్పులను తల్లి దండ్రులు, బిడ్డను సాకే ఇతర కుటుంభ సభ్యులు గుర్తించాలని అన్నారు. బిడ్డ లో ఏ వయసు లో ఎలాంటి మార్పులు వస్తాయో ముందుగా వారికీ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ అవగాహన కలిగించడానికి యునిసెఫ్ నుండి కార్యాచరణ ప్రణాళికను రూపొందించినట్లు తెలిపారు. అంగన్వాడీ కార్యకర్తలకు, ఆశ, డ్వాక్రా సంఘాలలోని మహిళలకు, స్వచ్ఛంద సంస్థలకు రెండు రోజులపాటు శిక్షణ ఉంటుందని తెలిపారు. ప్రతి పి హెచ్ సి స్థాయి లో తల్లి దండ్రులకు అవగాహన కల్పిస్తామన్నారు.

సఖి కార్యక్రమానికి ప్రసంశలు

జిల్లాలో అమలు చేస్తున్న సఖి కార్యక్రమానికి యునిసెఫ్ బృందం ప్రసంశలు కురిపించింది. 150 దేశాలు పాల్గొన్న జి-20 సదస్సు లో విజయనగరం నుంచి సఖి కార్యక్రమానికి చోటు దొరకడం అరుదైన సంఘటన అని పేర్కొన్నారు. అంతటి ఘనత సాధించిన జిల్లా యంత్రాంగానికి, సంబంధిత అధికారులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఒ డాక్టర్ భాస్కర రావు, ఐసిడిఎస్ పీడీ శాంత కుమారి, డిపిఒ మోహన్ రావు, మన్యం జిల్లా డిఐఒ డాక్టర్ జగన్ మోహన్ పాల్గొన్నారు.

మణిపూర్ సిఎంను భర్తరఫ్ చేయాలని

నేడు సిపిఎం నిరసన దీక్షలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

మణిపూర్ ఘటన నేపథ్యంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్. బీరెన్ సింగ్‌ను వెంటనే భర్తరఫ్ చేయాలని, మహిళలపై అత్యాచారానికి, దాడులతో హింసకు పాల్పడినవారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యాన విజయనగరం ఆర్టీసి కాంప్లెక్స్ వద్ద బుధవారం నిరసన దీక్షలు చేపట్టనున్నారు. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. మణిపూర్ ఏజెన్సీలో నిక్షిప్తమైనవున్న ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు ఆ రాష్ట్రంలోని రెండు తెగల మధ్య జరుగుతున్న నిరసనలను అక్కడి బిజెపి ప్రభుత్వం హింసకు పురిగొల్పిందన్నారు. అందులో భాగంగానే కుకీ గిరిజన తెగకు చెందిన మహిళలను బిజెపీ గూండాలు వివస్త్ర చేశారని, ఒక మహిళలపై అత్యాచారానికి పాల్పడ్డారని పేర్కొన్నారు. ఇదంతా అక్కడి అధికార పార్టీ బిజెపి కనుసన్నల్లో సాగిందని తెలిపారు. ఈ నేపథ్యంలో సిఎంను వెంటనే భర్తరఫ్ చేయాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని, మణిపూర్ రాష్ట్రంలో వెంటనే శాంతి నెలకొల్పాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ఈ నేపథ్యంలో జరుగుతున్న నిరసన దీక్షలో ప్రజాస్వామ్యవాదాలంతా పాల్గొని మణిపూర్ ప్రజలకు సంఘీభావం తెలిపాలని, బిజెపి పాశవిక చర్యలను ఖండించాలని కోరారు.

అర్హులందరికీ పథకాలు

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని 48వ డివిజన్ 59వ సచివాలయం పరిధిలోని సాలివీధి, అగురు వీధి ప్రాంతాలలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ ముందుకు సాగారు. ప్రభుత్వం పథకాలు పొందుతున్న లబ్ధిదారుల వివరాలతో కూడిన బుక్లెట్లను అందజేశారు. స్థానిక సమస్యల పైన ఆరా తీశారు. వాటిపై తక్షణమే స్పందించి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని అధికారులకు ఆదేశించారు. అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు పొందలేని వారి వివరాలు తెలియజేయాలని కోరారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నగరంలోని అనేక ప్రాంతాలలో మౌలిక సదుపాయాలను కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ నడిపిల్లి ఆదినారాయణ, సహాయ కమిషనర్ ప్రసాదరావు, వైసిపి నగర అధ్యక్షులు ఆశపు వేణు, పిఎసిఎస్ అధ్యక్షులు వేణు, పట్టా ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. 31 డివిజన్ 37, 38 సచివాలయాల పరిధిలో గాయత్రీ నగర్ లో జరిగిన గడపగడపకు కార్యక్రమంలో జోనల్ ఇన్‌ఛార్జి కోలగట్ల కృష్ణారావు, స్థానిక కార్పొరేటర్ ఎన్ని లక్ష్మణరావు పాల్గొన్నారు.



ప్రభుత్వ పథకాలపై ఆరా తీస్తున్న కోలగట్ల

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నగరంలోని 37వ డివిజన్ పరిధి బిసి కాలనీలో రూ.24.75 లక్షల వ్యయంతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు ఎపి కోలగట్ల వీరభద్రస్వామి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జోనల్ ఇన్చార్జి డాక్టర్ విఎస్ ప్రసాద్, స్థానిక కార్పొరేటర్ కడియాల రామకృష్ణ మాట్లాడుతూ గత 30 ఏళ్లలో కనీవినీ ఎరుగని అభివృద్ధి బిసి కాలనీలో నేడు సాధ్యమైందన్నారు.

ఇచ్చిన మాట ప్రకారం ఇక్కడ తాగునీరు, రహదారులు, కాలువలు వంటి సమస్యలన్నీ పరిష్కరిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం పెండింగ్లో ఉన్న రహదారులు, కాలువల పనులకు శంకుస్థాపన చేశారని వెల్లడించారు. కార్యక్రమంలో నగర మేయర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో తప్పులుంటే ఫిర్యాదు

బొబ్బిలిరూరల్ : ఓటర్ల జాబితాలో తప్పులుంటే ఫిర్యాదు చెయ్యాలని ఆర్‌డిఒ శేషశైలజ అన్నారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం లో రాజకీయ పార్టీ ప్రతినిధులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో బిఎల్‌ఒలకే ఓటర్ల జాబితా పరిశీలన జరుగుతుందన్నారు. ఈ పరిశీలనలో ఆయా పార్టీల వారు బూత్ స్థాయిలో బిఎల్‌ఏలను నియమించుకొని పరిశీలించుకోవచ్చన్నారు. ఆయా బిఎల్ఏలకు గుర్తింపు కార్డులు మంజూరు చేస్తామని ఆమె తెలిపారు. ఓటర్ల జాబితాలో ఎలాంటి తప్పులున్నా ఫిర్యాదు చేస్తే సరి చేస్తామన్నారు. ఎలెక్షన్ డిటి శ్రీనివాసరావు, టిడిపి, వైసిపి, జనసేన, సిపిఎం, కాంగ్రెస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వంగరను వీడని గజరాజులు

వంగర: ఈ నెల 22న మండలంలోకి ప్రవేశించిన గజరాజుల గుంపు వంగర మండలాన్ని విడటం లేదు. ప్రస్తుతం మండలంలోని గొర్లె శ్రీరాములునాయుడు మడ్డువలస ప్రాజెక్ట్ సమీపంలో వంగర రాజాం ప్రధాన రహదారి పక్కన తిష్ట వేశాయి. చెరకు, వరి నారు పొలాలను ధ్వంసం చేస్తున్నాయని మడ్డువలస, మగ్గూరు గ్రామాలకు చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గజరాజుల గుంపు ఒక్కోసారి ప్రధాన రహదారి పైకి వస్తుండడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. ప్రజలు గజరాజుల గుంపు వైపు వెళ్లకుండా తహశీల్దార్ ఐజాక్, ఎస్ఐ జనార్ధనరావు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

టోఫెల్ పరీక్షపై విద్యార్థులకు శిక్షణ

రామభద్రపురం: విద్యా సంస్కరణలలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పాఠశాలల్లో ప్రవేశపెట్టిన టోఫెల్ పరీక్ష (టెస్ట్ ఆఫ్ ఇంగ్లీష్ యాస్ ఎ ఫారిన్ లేంగ్వేజ్)పై ఆంగ్లభాషా బోధనోపాధ్యాయులు పాఠశాలల్లో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. మండలంలోని నాయుడు వలస పాఠశాలలో ఆంగ్లభాషోపాధ్యాయులు జెసి రాజు 3 నుంచి 8వ తరగతి విద్యార్థులకు ప్రతి మంగళ, గురు, శనివారాల్లో ఆంగ్ల భాష చదవటం, వినటం మాట్లాడటంపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నారు. మంగళవారం విద్యార్థులకు చదవటంపై ప్రాక్టీస్ పరీక్షను నిర్వహించారు.

మిగులు సీట్లకు 27లోగా దరఖాస్తులు

నెల్లిమర్ల: స్థానిక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో మిగులు సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కె.ఉషారాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో 4 సీట్లు, ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరంలో 60 సీట్లు మిగులు ఉన్నాయని ఈ నెల 27లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం సిఇసి గ్రూప్ లో మాత్రమే ఖాళీలున్నాయన్నారు. గత మార్చి నెలలో రెగ్యులర్ పాస్ అయిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నాడు నేడు పనులు పరిశీలన

వేపాడ: మండలంలోని ఎస్‌కెఆర్ పురం ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న రెండో విడత నాడు నేడు పనులను ఎంఇఒ పి. బాలాజీరావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తి చేయాలన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ గోడ పత్రిక ఆవిష్కరణ

వేపాడ: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ప్రత్యేక అధికారి లక్ష్మీనరసింహ స్వచ్ఛ సర్వేక్షణ గోడ పత్రికను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య పనులను ఏ విధంగా చేయించాలో అంశాలను గ్రామ సచివాలయాలలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు విధివిధానాలను తెలుసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు పూర్తి బాధ్యత వహించాలని ఆదేశించారు. ప్రస్తుతం వర్షాకాలం కావడం వల్ల గ్రామాల్లో ప్రజలకు పారిశుధ్య పనుల పై అవగాహన కల్పించాలని పంచాయతీ కార్యదర్శులకు వివరించారు. అనంతరం మండల స్థాయి అధికారులతో సమావేశమయ్యారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆరా తీశారు. ఈ సమావేశంలో తహశీల్దార్ ప్రసన్నకుమార్, ఎంపిడిఒ పట్నాయక్, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ వి దేవి, స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ జి రాంబాబు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

మెంటాడ: మధ్యాహ్న భోజన నిర్వాహకుల సమస్యలను పరిష్కరించాలని సిపిఎం జిల్లా సహాయ కార్యదర్శి రాకోటి రాములు డిమాండ్ చేశారు. స్థానిక జిల్లా పరిషత్ ఆవరణలో మంగళవారం మధ్యాహ్న భోజన నిర్వాహకుల సమస్యలు పరిష్కరించాలని గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధరలు పెరుగుతున్న నేపథ్యంలో మెనూ చార్జీలు పెంచాలన్నారు. నెలానెలా బిల్లులు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. వీటి పరిష్కారం కోసం ఈ నెల 31న చలో కలెక్టరేట్ ధర్నా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన నిర్వాహకులు సంఘం మండల కార్యదర్శి పొట్నూరు వరలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

రూ. 55వేలు ఆర్థిక సాయం

గరివిడి : మండలంలోని బొండపల్లి గ్రామస్తులంతా కలిసి చీపురుపల్లి మండలం గచ్చులవలస గ్రామానికి చెందిన రొంగలి రాము అనే యువకుడికి బోన్ క్యాన్సర్ వచ్చిందని తెలుసుకుని మంగళవారం రూ.55వేలు ఆర్థిక సహాయం అందించారు. బాధితుడు నిరుపేద కావడంతో తాము ముందుకొచ్చి సాయం చేశామని మిగతావారు కూడా స్పందించి సాయం చేయాలని యువత కోరారు.

పటిష్టంగా బ్యాంకుల్లో భద్రత

రామభద్రపురం: బ్యాంకుల్లో భద్రత పటిష్టంగా అమలు చేయాలని ఎస్ఐ సురేంద్ర నాయుడు సూచించారు. మంగళవారం మండల కేంద్ర పరిధిలో ఉన్న వివిధ బ్యాంకుల్లో ఉన్న నిఘా విభాగాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరగాళ్ల బ్యాంకులను టార్గెట్ చేస్తూ నేరాలకు పాల్పడుతున్న సంఘటనలు జరుగుతున్నాయని వాటిని అరికట్టే దిశగా బ్యాంకు సిబ్బందికి భద్రతా పరమైన సూచనలు, సలహాలు ఇస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బిఐ మేనేజర్ సతీష్ కుమార్, అసిస్టెంట్ మేనేజర్ రమేష్, క్యాష్ ఆఫీసర్ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మిషన్ ఇంద్రధనస్సులో వ్యాక్సినేషన్

విజయనగరం: మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమం కింద ఐదేళ్లలోపు వయసు పిల్లలకు, గర్భిణులకు వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపడుతున్నట్టు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో ప్రతి నెలలో 6 రోజులు చొప్పున నిర్వహిస్తామనిత తెలిపారు. ఇంతవరకు వాక్సిన్ వేసుకోని వారిని యుద్ధ ప్రాతిపదికన గుర్తించాలని కలెక్టర్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మిషన్ ఇంద్రధనసు, వాతావరణ మార్పుపై జిల్లా టాస్క్ ఫోర్స్ సమావేశం కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమంలో అన్ని శాఖలు సమన్వయంగా పనిచేసి ఏ ఒక్కరూ మిగిలిపోకుండా శతశాతం వాక్సినేషన్ పూర్తి చేయాలన్నారు. అనంతరం వైద్య శాఖలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన ఉద్యోగులకు ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం నుంచి ప్రసంసా పత్రాలను, నగదు బహుమతిని కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. సమావేశంలో డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.భాస్కర రావు, డిఐఒ అచ్చుతవల్లి, మున్సిపల్ కమిషనర్ శ్రీ రాములు నాయుడు, పాల్గొన్నారు.

కల్తీలను అరికట్టాలి

విజయనగరం టౌన్: మనిషి నిజ జీవితంలో నకిలీ ఆహారపదార్థాలను తింటూ అనారోగ్యం పాలవుతున్నారని సివిఐ జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ చదలవాడ హరిబాబు అన్నారు. జిల్లాలో 2రోజులు పాటు నిర్వహిస్తున్న 'అడగండి-చెబుతాం' కార్యక్రమంలో భాగంగా కల్తీ, తూనికలు కొలతలలో మోసాలుపై అవగాహనా సదస్సును కంటోన్మెంట్ హైస్కూల్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనుషులు నిత్యం తింటున్న ఫాస్ట్ ఫుడ్‌లో ఎలాంటి కల్తీ పదార్థాలు కలుస్తున్నాయి. నిత్యావసర ఆహార వస్తువులు కల్తీ ఎలాగ జరుగుతుంది, జీవితంలో ఎలా మోసపోతున్నాం అనే విషయాలపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో డిఎస్ఒ మధుసూదన్ పాఠశాల హెచ్ఎం అప్పల నాయుడు పాల్గొన్నారు. కన్స్యూమర్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆ సొసైటీ అధ్యక్షులు ఎంఎస్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్ మృతికి నివాళి

బొబ్బిలి: పురపాలక సంఘం పరిధిలోగల 18వ వార్డులో గత 20 సంవత్సరాల నుండి రాజకీయంగా ప్రజలకు సేవలందించిన సీనియర్ నాయకుడు, మాజీ కౌన్సిలర్ బూర్లి నాగరాజు పార్థివదేహాన్ని మంగళవారం టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి బేబినాయన సందర్శించి, పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

సమస్యలను పరిష్కరించండి

బాడంగి: ఎస్‌టిల సమస్యలను పరిష్కరించాలని టిడిపి రాష్ట్ర ఎస్‌టి జనరల్ సెక్రటరీ పాలవలస గౌరు విజయనగరంలో ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ డివిజి శంకర్‌రావుని మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి కోరారు. జిల్లాకు ఐటిడిఎ లేదని అన్ని కులాలకు ఇచ్చిన్నట్లు ఎస్‌టి కులాలకు కూడ ప్రభుత్వం పథకాలు పెట్టి ఆదుకోవాలని కోరారు. ఎరుకల కులస్తులు చేతి వృత్తిలు పోయి గ్రామాలను వదిలేసి ఇతర రాష్టాలకు వెళ్లి పోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

అసలే గుంతలు.. ఆపై వానలు..

కోతకు గురైన రహదారిని కప్పుతున్న జెసిబి

ప్రజాశక్తి- బాడంగి

అసలే గుంతలు.. ఆపై వానలు.. దీంతో రోడ్లన్నీ వరదనీటితో బురదమయమయ్యాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని గూడెపు వలస, రావివలస బీటి రోడ్ల పరిస్థితి అధ్వాన్నంగా మారాయి. ఇప్పటికే ఉన్న గుంతల్లో వర్షపు నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. దారి పొడవునా గుంతలు ఏర్పడి నీళ్లు చేరడంతో రాకపోకలకు ఆటంకం ఏర్పడుతోంది. ఏళ్ల తరబడి మరమ్మతులకు నిధులు కేటాయించకపోవడంతో చిరు జల్లులకే రోడ్లన్నీ చెరువుల్లా మారిపోతున్నాయి. మరమ్మతులకు గురైన రహదారుల కోసం ప్రతిపాదనలు పంపినా ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో ఎక్కడి వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ఉంది. ముఖ్యంగా రోడ్డుపై గుంతలను సమీపించే వరకు గుంతలు కనిపించకపోవడంతో వాహన దారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి

బాడంగి: చెరువును తలపిస్తున్న రామచంద్రాపురం, రావివలస రోడ్డు

చిన్నపాటి వర్షానికే దెబ్బ తిన్న రోడ్డు

వేపాడ: మండలంలో సోంపురం జంక్షన్ నుండి వేపాడ మీదుగా ఆనందపురం జంక్షన్ వరకు వెళ్లే రోడ్డు నిర్మాణం విస్తరణ పనులు ఇటీవల నిర్మించారు. అయితే నాణ్యత లోపం వల్ల ఇటీవల కురిసిన చిన్న పాటి వర్షానికి కూడా అరిగిపాలెం, జగ్గయ్యపేటకు మధ్య కల్లాల వద్ద రోడ్డు ఒకవైపు బీటలు వారింది. రోడ్డుకు ఇరువైపులా ఉన్న బెర్మలకు నాణ్యమైన గ్రావెల్ వేయకపోవడంతో వర్షం పడిన వెంటనే అది పొలం వైపు జారిపోయింది. దీంతో రోడ్డు బీటలు వారింది. నాణ్యత లేకుండా నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకుని రోడ్డును బాగుచేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వేపాడ: బీటలు వారిన రోడ్డు

రాకపోకలకు అంతరాయం

వేపాడ: మండలంలోని బక్కు నాయుడుపేట గ్రామానికి చెందిన చెరువు గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా పూర్తిగా నిండిపోయింది. దీంతో చెరువుకున్న మదుము ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో సోంపురం జంక్షన్ నుండి ఆనందపురం వరకు గల రోడ్డు మంగళవారం కోతకు గురైంది. ఫలితంగా ద్విచక్ర వాహనాలతో పాటు బస్సులు, లారీలు, ఆటోలు రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. వేపాడ నుండి ఆనందపురం వెళ్లే ప్రయాణికులు ఎం సింగవరం, బాణాది, బల్లంకి గ్రామాల మీదుగా చేరుకోవాల్సి వస్తుంది. పరిస్థితిని గమనించిన అధికారులు వెంటనే స్పదించి కోతకు గురైన రోడ్డు మార్గాన్ని జెసిపి సహాయంతో కంకర వేసి పునర్నిర్మాణ పనులు చేపడుతున్నారు.

గోతులు పూడ్చండి మహాప్రభో

నెల్లిమర్ల: నెల్లిమర్ల నగర పంచాయతిలో గోతులను పూడ్చాలని నగర వాసులతో పాటు ప్రయాణికులు కోరుతున్నారు. స్థానిక రామ తీర్థం జంక్షన్ నుంచి కొత్త పేట వెళ్లే రహదారిలో రైల్వే బ్రిడ్జి కింద గోతులు ఏర్పడి వాహన దారులు, నగర పంచాయతి వాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గోతుల్లో నీరు చేరడంతో వాహన దారులు, పాదచారులు ప్రమాదాలకు గురై గాయాలు పాలవుతున్నారు. ముఖ్యంగా ఈ రహదారిలో రాత్రి, పగలు నిత్యం వేలాది వాహనాలు, పాద చారులు ప్రయాణం చేస్తున్న నేపథ్యంలో వర్షపు నీరు చేరి గుంతలు కనిపించక ప్రమాదాలు జరిగి ఆసు పత్రి పాలవు తున్నారని స్థానికులు చెబుతున్నారు. పలు మార్లు అధికార్ల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గుంతలు పూడ్చి ప్రమాదాలు నివారించాలని కోరుతున్నారు.

నెల్లిమర్ల: రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా ఉన్న గొయ్యి

జగనన్న సురక్షతో ఇంటి వద్దకే సేవలు

ప్రజాశక్తి - వంగర

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న సురక్ష కార్యక్రమంలో ద్వారా ప్రజల ఇంటి వద్దకే సేవలు అందుతున్నాయని ఎంపిపి ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ అన్నారు. మండలంలోని మద్దివలస, శివ్వాం గ్రామాలలో ఆయా గ్రామాల సర్పంచులు ఉత్తరావెల్లి గణేష్ బెనర్జీ, బొకేల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంపిపి పాల్గొని అర్జీదారులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి కిమిడి ఉమామహేశ్వరరావు, తహశీల్దార్ డి ఐజాక్, ఎంపిడిఒ వావిలిపల్లి శ్రీనివాసరావు, బొకేల వెంకట అప్పలనాయుడు, ఏనుగుతల వెంకట నాయుడు, గారాల రతాల నాయుడు, బెవర శ్రీనివాసరావు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

డెంకాడ: వైసిపి ప్రభుత్వం అవినీతి రహిత పరిపాలన అందిస్తుందని ఎంపిపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు చెప్పారు. మండలంలో పినతాడివాడ, పెదతాడివాడ సచివాలయాల్లో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గతంలో సంక్షేమ పథకాలు వర్తించాలంటే కార్యాలయాలు చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగే వారిని జన్మభూమి కమిటీలకు లంచం ఇస్తే గాని పని జరిగేది కాదని గుర్తు చేశారు. సచివాలయ వాలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రస్తుతం నేరుగా ఇంటి వద్దకే పథకాల అందిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మునాయుడు, ఎంపిడిఒ డిడి స్వరూప రాణి, తహశీల్దార్ పి ఆదిలక్ష్మి, సర్పంచులు లెంక లక్ష్మణరావు, ఎంపిటిసిలు విజనగిరి అచ్చింనాయుడు, పోంతపల్లి జగన్నాథం, జాతిపల్లి రమేష్, మాజీ సర్పంచులు కరుమజ్జి త్రినాధరావు, వాల్లే వెంకట్రావు, మండల జెఎస్‌సి కన్వీనర్ సారిక గౌరీ శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

భోగాపురం: వైసిపి పాలనలోనే ప్రజలకు సంక్షేమ పాలన అందుతుందని వైసిపి మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణ అన్నారు. భోగాపురం మండలంలోని పోలిపల్లిలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పోలిపల్లి సర్పంచ్ కర్రోతు వెంకటరమణ, ఉప సర్పంచ్ రామకృష్ణ, సవరవిల్లి సర్పంచ్ ఉప్పాడ భాస్కర్ రెడ్డి, ఎంపిటిసి తాతయ్యలు, ఎంపిడిఒ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: వైసిపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలతో రాష్ట్ర ప్రజలు సురక్షితంగా ఉంటారని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎంపిపి సండి సోమేశ్వరరావు అన్నారు. పట్టణంలోని సచివాలయం 1,3 వద్ద మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరంలో వారు పాల్గొని అర్హులకు ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే హైమవతి, ఎంపిడిఒ శేషుబాబు, డైరెక్టర్ రాంబాబు, వైస్ ప్రెసిడెంట్ కుమార్, జెడ్‌పిటిసి ఎమ్.వెంకటలక్ష్మి, ఎస్.కోట మేజర్ పంచాయతీ సర్పంచ్ జీ.సంతోషికుమారి, ఎంపిటిసిలు మజ్జి దేవి, వాకాడ సింహాచలం, మోపాడ గౌరీశ్వరి, వార్డు మెంబర్ మామిడి కృష్ణవేణి, నాయకులు రామకృష్ణ, జగదీష్, భారతి, కోటి, జయశంకర్, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌కోట: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

బొబ్బిలిరూరల్: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలు పరిష్కారమవుతాయని ఎంపిపి శంబంగి లక్ష్మి అన్నారు. మండలంలోని రంగరాయపురం సచివాలయ పరిధిలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. అనంతరం దరఖాస్తులు చేసుకున్న కొంత మంది అర్జీదారులకు 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ఆమె చేతులుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు శంబంగి వేణుగోపాలనాయుడు, జెడ్‌పిటిసి సంకిలి శాంతకుమారి, ఉప తహశీల్దార్ గౌరీ శంకర్, మండల జెసిఎస్ కన్వీనర్ తమ్మిరెడ్డి దామోదర్, నాయకులు సత్యనారాయణ, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బొబ్బిలి: పురపాలక సంఘంలోని 7,15వ సచివాలయం పరిధిలో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్మెన్ సావు వెంకట మురళీ కృష్ణారావు పాల్గొని అర్హులకు ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సత్తారు శ్రీనివాస రావు, మున్సిపల్ మేనేజర్ శివ ప్రసాద్, వైస్ చైర్మన్ గోలగాని రమాదేవి, బుడా ఛైర్మెన్ ఇంటి పార్వతి, పట్టణ అధ్యక్షులు ఇంటి గోపాల్ రావు, పట్టణ జెసిఎస్ కన్వీనర్ రేజేటి ఈశ్వర్ రావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: గత 20రోజులుగా జరుగుతున్న జగనన్న సురక్ష కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. మండలంలోని మాల్యాడలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే బడ్డు కొండ అప్పల నాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పి. సురేష్ బాబు పాల్గొని అర్హులైన వారికి ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలతో బాటు అర్హులైన వారిని నేరుగా ధ్రువ పత్రాలు అందించడానికి జగనన్న సురక్ష కార్యక్రమం ప్రవేశ పెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సలహా మండలి సభ్యులు అంబళ్ళ శ్రీ రాములు నాయుడు, డిసిసిబి వైస్ ఛైర్మన్ చనమల్ల వెంకట రమణ, జెడ్‌పిటిసి గదల సన్యాసి నాయుడు, టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, వైస్ ఎంపిపి సారికి వైకుంఠం నాయుడు, నాయకులు పప్పల బలరాం, రెడ్డి అప్పల నాయుడు, తహశీల్దార్ కెవి రమణ రాజు, ఎంపిడిఒ జి. గిరి బాల, ఇఒపిఆర్‌డి హెచ్. భానోజీ రావు తదితరులు పాల్గొన్నారు.

బొండపల్లి: అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందించేందుకు ఉపయోగపడే ధ్రువ పత్రాలను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని ఎంపిపి చల్ల చలం నాయుడు, జెడ్‌పిటిసి రాపాక సూర్యప్రకాష్‌రావు అన్నారు. మంగళవారం దేవుపల్లి, గొల్లుపాలెం సచివాలయాల వద్ద జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ప్రసాద్ రావు, ఎంపిడిఒ వైబి.రాజేంద్రప్రసాద్, ఇఒపిఆర్‌డి సుగుణాకర్ రావు, ఎపిఒ బి.కృష్ణవేణి, ఎపిఎం సులోచనా దేవి, ఎఒ మల్లికార్జున రావు తదితరులు పాల్గొన్నారు.

పూసపాటిరేగ: సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందీ ప్రభుత్వమని జెసిఎస్ మండల కన్వీనర్ మహంతి శ్రీనువాసరావు అన్నారు. మంగళవారం మండలంలోని చౌడువాడ, పూసపాటిరేగ -2 సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అర్హులైన వారికి చౌడువాడ సచివాలయ పరిధిలో 911 ధ్రువ పత్రాలను, పూసపాటిరేగ సచివాలయ పరిధిలో 488 ధ్రువ పత్రాలను అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ప్రజలకు అందజేస్తున్న సేవలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఇమంది బాస్కరావు, ఎంపిడిఒ జి. రామారావు, నాయకులు మొంగం నాగబాబు, కొయ్య యల్లన్న రెడ్డి, పసుపులేటి శ్రీనువాసరావు, కార్యదర్శి సంతోషి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, అన్ని శాఖల అధికార్లు, ప్రజలు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ సైకిల్ యాత్రను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- గజపతినగరం

ఈ నెల 31 నుంచి వచ్చే నెల 9వ తేదీ వరకూ నిర్వహించనున్న సైకిల్ యాత్రను జయప్రదం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి డి. రాము కోరారు. ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ ఆవరణంలో సైకిల్ యాత్రకు సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. రాము మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న విద్యారంగ సమస్యల పైన కొత్తవలసలో ఈ సైకిల్ యాత్ర ప్రారంభమై విజయనగరం వరకు సుమారు 400 కిలోమీటర్లు నిర్వహిస్తామన్నారు. బకాయి ఉన్న విద్యాదీవెన, వసతి దీవెన విడుదల చెయ్యాలన్నారు. నియోజకవర్గ కేంద్రంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి సొంత భవనం ఏర్పాటు చేయాలని, మంజూరైన పోస్టులను భర్తీ చేయాలని కోరారు. దత్తిరాజేరు జూనియర్ కాలేజీ లో పోస్టులు భర్తీ చేసి, సొంత భవనం ఏర్పాటు చెయ్యాలన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందించాలన్నారు. బొండపల్లి ప్రభుత్వ హైస్కూల్ పక్కన ఉన్న సంక్షేమ హాస్టల్ భవనాన్ని వెంటనే ఓపెన్ చేయాలని అన్నారు. మెంటాడ ప్రభుత్వ హైస్కూల్ గ్రీన్ ఫీల్డ్ హైవేలో భాగంగా తొలగించడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. నూతన భవనం నిర్మించి పిల్లలందరినీ అక్కడికి మార్చిన తర్వాతే పాత భవనాన్ని తొలిగించాలని డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టల్స్ మెస్ చార్జీలు పెంచాలని, బకాయి ఉన్న కాస్మోటిక్ చార్జీలు ఇవ్వాలని కోరారు. పై డిమాండ్ల పరిష్కారానికి ఆగష్టు 3న గజపతినగరంలో జరగబోయే ఈ సైకిల్ యాత్రను విద్యార్థి లోకమంతా జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కూర్మారావు, మండల నాయకులు పి లక్ష్మణ్ విద్యార్థులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

సచివాలయం ద్వారా మరిన్ని సేవలు

ప్రజాశక్తి - కొత్తవలస

గ్రామ సచివాలయం ద్వారా ప్రజలు మరిన్ని సేవలను పొందాలని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం కొత్తవలస-4 సచివాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ఈ ప్రభుత్వం అభివృద్ధిపైనే దృష్టి పెట్టిందన్నారు. అనంతరం జగనన్న సురక్ష కార్యక్రమంలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడు బాబు, వైసిపి నాయకులు రొంగలి జగన్నాథం, ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, పిఎసిఎస్ అధ్యక్షులు గోరపల్లి శివ, జెసిఎస్ మండల ఇంచార్జి బొంతుల వెంకటరావు, మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, లెంక రామన్న పాత్రుడు, పి ఎస్ఎన్ పాత్రుడు, ఎంపిటిసిలు సూర్యనారాయణ శాస్త్రి (బాబి), అనూష, లెంక భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస: సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కడుండి శ్రీనివాసరావు

బొబ్బిలిరూరల్: మండలంలోని చింతాడ గ్రామంలో మంగళవారం ఎమ్మెల్యే ఎస్‌విసిహెచ్ అప్పలనాయుడు నూతన సచివాలయ, హెల్త్ సెంటర్, ఆర్బికేలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అవసరమయ్యే విత్తనాలు, ఎరువులు రైతు భరోసా కేంద్రాల ద్వారా అందుబాటులో ఉంటాయని రైతు భరోసా కేంద్రాల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ ప్రభుత్వం ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని అందులో భాగంగానే ప్రతి పల్లెలో ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి శంబంగి లక్ష్మి, పిఆర్ డిఇ అప్పారావు, జెడ్‌పిటిసి శాంత కుమారి, సర్పంచ్ బి. తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

బిజెపి దమనకాండను ఆపాలి

ప్రజాశక్తి- మెంటాడ

మణిపూర్ రాష్ట్రంలో ఆదివాసీ మహిళలపై బిజెపి ధమనకాండను ఆపాలని సిపిఎం జిల్లా సహాయ కార్యదర్శి రాకోటి రాములు అన్నారు. మండలంలోని లోతుగెడ్డ గ్రామంలో మండల మంగళవారం మణిపూర్ ఘటనకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. రాములు మాట్లాడుతూ ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి మహిళల పైన హత్యలు, అత్యాచారాలు ఆపాలని అన్నారు. నిరసన కార్యక్రమంలో ములగ రమేష్, సిహెచ్ కృష్ణవేణి, పంచాలి రాములమ్మ, శెట్టి పావని పాల్గొన్నారు.

బొబ్బిలి: ఇటీవలి మణిపూర్‌లో స్థానిక మహిళలపై జరిగిన హత్య, అత్యాచారం యావత్తు దేశ ప్రజానీకాన్ని విచారింపచేసేలా ఉన్నాయని స్థానిక న్యాయవాది తుమరాడ గంగాధర్ అన్నారు. మంగళవారం స్థానిక రాజా కళాశాల మైదానంలో నిరసన తెలిపారు. స్థానిక పెట్రోల్ బంక్ దగ్గర ఆటో యూనియన్‌తో కూడా కలిసి న్యాయం కావాలంటూ నినాదాలు చేసారు.

పుట్ట గొడుగులు తిని అస్వస్థత

రేగిడి: రేగిడి మండలంలోని దేవుదల గ్రామంలో విష పూరితమైన పుట్ట గొడుగులు తిని ఇనమల సుజాత, ఇనమల హరిబాబు, ఇనమల సరోజినిలకు రక్త వాంతులు పట్టుకుని అస్వస్థతకు గురయ్యారు. సోమవారం రాత్రి హరిబాబు వ్యవసాయ పనులు పూర్తిచేసుకుని పుట్ట గొడుగులు తెచ్చారు. పుట్టగొడుగులతో వండుకొని తిని పడుకున్నారు. రాత్రి 1గంట సమయంలో తీవ్ర వాంతులతో పాటు రక్తం పడడం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కుటుంబ సభ్యులు 108కు సమాచారం ఇవ్వగా రేగిడి 108 సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని ఈఎంటి మీసాల ఈశ్వరరావు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. సకాలంలో ప్రథమ చికిత్స చేయడం వల్ల ప్రమాదం నుంచి బయట పడ్డారని బాధిత బంధువులు 108 సిబ్బందిని అభినందించారు. పుట్టగొడుగులు తిన్న కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

బ్యాడ్మింటన్ పోటీలకు ఇద్దరు ఎంపిక

శృంగవరపుకోట: స్థానిక ఫ్రెండ్స్ బ్యాడ్మింటన్ అకాడమీకి చెందిన క్రీడాకారులు హారిక, మౌనికలు రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యారు. వీరిని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు తన నివాసంలో మంగళవారం అభినందించారు. అకాడమీ చీఫ్ కోచ్ పొట్నూరు శ్రీరాములు మాట్లాడుతూ ఈ నెల 29వ తేదీ నుండి 31వ తేదీ వరకు తిరుపతిలో జరగనున్న రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ అండర్ 19 బాలికల డబుల్స్ విభాగంలో జిల్లా టీమ్‌కు వీరు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఈ నెల 8,9 తేదీల్లో విజయనగరం రాజీవ్ గాంధీ స్టేడియంలో జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ నిర్వహించిన జిల్లా స్థాయి చాంపియన్షిప్ కం సెలక్షన్స్‌లో డబుల్స్ విభాగంలో ప్రథమ స్థానం సాధించి జిల్లా చాంపియన్లుగా నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు శ్రీరాములు తెలిపారు. క్రీడాకారులు రవాణా ఖర్చులకు ఎమ్మెల్సీ రూ. 5వేలు ఆర్థిక సాయంగా అందించినట్లు ఆయన తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను ఫ్రెండ్స్ రిక్రియేషన్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ ఎస్‌వి సత్యశేఖర్, స్నేహ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు ఏఎస్ వెంకట్రావు ఆనల రమేష్, ఆనల మోహన్, కోచ్ ఎండి అస్లాంలు అభినందనలు తెలియజేశారు.

గురుకులంలో కలకలం

పలువురు విద్యార్థులకు అస్వస్థత

ప్రజాశక్తి- వంగర

మండలంలోని మడ్డువలస డాక్టర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో కలకల రేగింది. కల్తీ ఆహారం తిని సుమారు 20 విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వీరిలో ఆరుగురు పరిస్థితి విషమించడంతో రాజాం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆదివారం జరిగిన సంఘటన అధికారుల గోప్యంతో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గురుకులాన్ని మంగళవారం తహశీల్దార్ ఐజాక్ పరిశీలించి వైద్యులతో దగ్గరుండి వైద్య సేవలందిస్తున్నారు. ఈ విషయంపై జిల్లా కోఆర్డినేటర్ తోట పద్మజను వివరణ కోరగా ప్రస్తుతం విద్యార్థుల పరిస్థితి నిలకడగానే ఉందని ఆందోళన చెందాల్సిన పనిలేదని స్పష్టం చేశారు.

CHANGE OF NAME

I, Undersigned **SARITHA RANI PATRO (Old Name),** W/o. Prema Chendra Patnaik, Resident of Mouli Vihar, Flat No.304, 2nd floor, Near Bangaramma Temple, Phase-3, Vuda Colony, Vizianagaram District-535003. Changing my name from **SARITHA RANI PATRO (Old Name)** to **SARITA RANI PATRA (New Name)** Shall hence forth I am being called as **SARITA RANI PATRA (New Name)** for all purpose.

మహారాజశ్రీ విజయనగరం జూనియర్ సివిల్ జడ్జి మరియు ఎక్సైజ్ మెజిస్ట్రేట్ వారి కోర్టులో
EP 92/2020 - OS No.289/2019

Between :
కందికుప్ప మోహన్ రావు ...... డిక్రి హోల్డర్
మరియు
ఎదురేసపు శ్రీనివాసరావు ....జడ్జిమెంట్ డెటర్
To
ఎదురేసపు శ్రీనివాసరావు, S/o రాఘవాచారి, age-48 years, R/o Door No. 14-6-22 శివాలయం వీధి, విజయనగరం.

యిందలి డిక్రి హోల్డర్ పై నెంబరు దావా డిక్రి బకాయి పైకము రాబట్టె నిమిత్తం అమలు షెడ్యూలు ఆస్తిని దాఖలు చేసియున్నారు. కనుక పై నెంబరు అమలుకై దాఖలు చేసియున్నారు కనుక పై నెంబరు అమలును ఎందుకు అమలు పరచకూడదో మీ ఆక్షేపణలను పై కోర్టువారి ఎదుట **తేది 1-8-2-023 ఉదయం 10-30గంటల**కు స్వయంగా గాని వకీలు ద్వారా గాని హాజరై తెలియచేయవలసినదిగా ఇందుమూలంగా తెలియజేయడమైనది.

ఎం.రవీంద్రనాథ్
డిక్రి హోల్డర్ ఎడ్వకేట్,
విజయనగరం

మహారాజశ్రీ ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి-విజయనగరం
O.S.200/2022

శ్రీమతి గంగిశెట్టి విజయలక్ష్మి మరి ఒకరు ...వాదులు
V/s
శ్రీశ్రీ పశుపురెడ్డి వంశీక్రిష్ణ మరి ముగ్గురు....ప్రతివాదులు
నోటీసు
To
D1 : శ్రీ పశుపురెడ్డి వంశీక్రిష్ణ, S/o లేటు గోపాలక్రిష్ణ, ప్లాట్ నెం. 40, లక్ష్మీనగణపతి కాలనీ, పూల్‌బాగ్ ఏరియా, విజయనగరం.
D3 : అడ్డగల్లా మోహిని D/o రాజ్‌మణిపాల్, ప్లాట్ నెం. 40, లక్ష్మీనగణపతి కాలనీ, పూల్‌బాగ్ ఏరియా, విజయనగరం.

పై వాదులు, మీ ఇరువురు మీద మరియు మరి ఇద్దరిపై, పై నెంబరు దావా కోర్టులో వేసివుంటిరి. సదరు దావాలో మీకు ఎన్నిసార్లు కోర్టుద్వారా సమనులు పంపిన అందకపోవుటచే కోర్టువారు ఉత్తరవు ప్రకారము ఇందుమూలంగా తెలియజేస్తూ, పై నెంబరు గల దావా తేది 7-08-2023 నాడు వున్నది. కావున ఆ తేదిన మీరు గాని, మీ తరుపున వకీలు గానీ, పై కోర్టులో ఉదయం 10-30 గంటలకు హాజరు కావలెను. లేనిచో పై దావా మీ పరోక్షమున విచారించబడును.

P.V. Ganesh, Advocate
వాది తరుపు న్యాయవాది,
విజయనగరం